క్లుప్తంగా

వైఎస్సార్ సీపీలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు సముచిత స్థానం

ఎంపీపీ శ్రీనివాసరావు



పెదకాకాని: రాష్ట్ర చరిత్రలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు సముచిత స్థానం కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు అన్నారు. పెదకాకాని మండల వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ తక్కెళ్ళపాడు, ఉప్పలపాడు గ్రామాల్లో వ్యవసాయ పరపతి సంఘాలు ఏర్పాటైన 50 ఏళ్ళ చరిత్రలో ఎస్సీలను చైర్‌పర్సన్‌లుగా నియమించిన ఘనత వైఎస్సార్ సీపీకి, స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్యకే సాధ్యం అన్నారు. ఎన్నికల సమయం దగ్గర పడుతున్న సమయంలో టీడీపీ బీసీలపై కపట ప్రేమ చూపిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు షేక్ షహనాజ్, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ జాకీర్‌హుస్సేన్, తక్కెళ్లపాడు పీఏసీఎస్ చైర్‌పర్సన్ శివాబత్తుని దయానంద్ పాల్గొన్నారు.

ఘనంగా కెనడీ స్కూల్ వార్షికోత్సవం



గుంటూరురూరల్: ప్రతి విద్యార్థి క్రమ శిక్షణతో లక్ష్య సాధన దిశగా కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి. శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం గోరంట్లలోని నెక్స్ట్ జెన్ కిడ్స్ స్కూల్‌లో కెనడీ స్కూల్స్ వార్షికోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటుగా క్రీడలు, సాంకేతిక నైపుణ్యం, పెంపొందించుకోవాలని తెలిపారు. గురువులను, తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. నేటి బాలలే రేపటి పౌరులుగా ఎదిగి, అన్ని రంగాల్లో ప్రగతిని సాధించాలని సందేశాన్ని ఇచ్చారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులకు క్రీడలు తదితర పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకురాలు కె.బేబి సావిత్రి, డైరెక్టర్లు కె.శ్రీకాంత్, శ్రీవిద్య, ప్రిన్సిపాల్ ఐజాక్, వైస్ ప్రిన్సిపాల్ చైతన్య, సునీత, వసంత, హసీనా పాల్గొన్నారు.

వీఆర్‌ఓ ఇబ్బంది పెడుతున్నాడు

ఏటుకూరు గ్రామస్తుల ఆరోపణ



గుంటూరు రూరల్: గ్రామ వీఆర్‌ఓ ప్రజల సమస్యలు పరిష్కరించకుండా ఇబ్బందులు పెడుతున్నాడని గ్రామానికి చెందిన కనక దుర్గ ఆలయ ధర్మకర్త నాగేశ్వరరావు ఆరోపించారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏటుకూరు గ్రామంలో వీఆరోఓ ప్రతి పనికి డబ్బులు అడుగుతున్నాడని ఆరోపించారు. వీఆర్వో ప్రజలకు అందుబాటులో ఉండటంలేదన్నారు. అడంగల్, పాస్ పుస్తకాలకోసం దరఖాస్తు చేసుకోవాలంటే ఏటుకూరు సచివాలయంలో దరఖాస్తు చేయవద్దు బుడంపాడు సచివాలయంలో దరఖాస్తు చేయాలని తిప్పుతున్నాడన్నారు. గ్రామంలో తనకున్న అరెకరం పొలంను వీఆర్‌ఓ సర్వే చేసి 40 సెంట్లుగా చూపుతున్నాడని పత్రాలు చూపిన పట్టించుకోవటం లేదని ఆరోపించారు. తనకు న్యాయం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పెదకాకాని: జాతీయ రహదారి దాటుతున్న వ్యక్తిని కారు ఢీ కొనడంతో వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. పెదకాకాని మండలంలోని నంబూరు డాంగేనగర్ సమీపంలో గత రెండు రోజులుగా దీనీ ఇజ్‌తిమా ప్రార్థనలు జరుగుతున్నాయి. ఈ ప్రార్థనలకు కడప టౌన్ నుంచి షేక్ మహమ్మద్ హాజరయ్యాడు. ఆదివారం సాయంత్రం సమయంలో ఆల్పాహారం తీసుకునేందుకు సమీపంలో ఉన్న జాతీయ రహదారి దాటుతుండగా గుంటూరు వైపు నుంచి విజయవాడ వెళుతున్న కారు ఢీ కొంది. ఈ ఘటనలో తీవ్రగాయాలైన షేక్ మహమ్మద్(38)ను చికిత్స నిమిత్తం చినకాకాని ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తరలించారు. మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

జూదరుల అరెస్ట్

పెదనందిపాడు: పేకాటాడుతున్న ఐదుగురు జూదరులను అరెస్ట్ చేసినట్లు ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. వివరాలు.. ఆదివారం సాయంత్రం మండల పరిధిలోని గోగులమూడిలో పేకాటాడుతున్నట్లు అందిన సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.2,290 స్వాధీనం చేసుకున్నారు.

పక్కాగా 'ఈ క్రాప్'

- ఇప్పటి వరకు 94 శాతం పూర్తి
- 52 శాతానికి చేరి ఈకేవైసీ ప్రక్రియ

ప్రత్తిపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతులకు అన్ని విధాలా అండగా నిలుస్తున్నారు. వ్యవసాయ రంగంలో నిత్యం ఆటుపోట్లను ఎదుర్కొంటున్న కర్షకులకు మేమున్నామన్న భరోసాను రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు కలిగిస్తూ వస్తుంది. విత్తనం కొనుగోలు చేసింది మొదలు దిగుబడులు చేతికొచ్చే వరకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా, సాగుకు వ్యవసాయ యంత్రాలు, పరికరాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్ట పరిహారం, బీమా, ఆర్‌బీకేల ద్వారా నాణ్యమైన ఎరువులు, రాయితీపై విత్తనాలు.. ఇలా అన్ని రకాలుగా రైతు వెన్నంటే ప్రభుత్వం ఉంటుంది. ప్రభుత్వం అందించే వ్యవసాయ సంబంధ పథకాలు సక్రమంగా రైతుకు అందాలన్న ఉద్దేశంతో ఈ క్రాప్ బుకింగ్ విధానాన్ని ప్రభుత్వం తీసుకువచ్చింది. ఈ క్రాప్ నమోదు చేయించుకుంటే రైతుకు బహుళ ప్రయోజనాలు చేకూరనున్నాయి. పూర్తి పారదర్శకతతో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా పక్కాగా, పకడ్బందీగా చురుగ్గా నమోదు చేస్తున్నారు.

94 శాతం పూర్తి..

ప్రస్తుతం రబీ సీజన్‌లో మండలంలో 6,197 ఎకరాల్లో రకరకాల పంటలను సాగు చేశారు. పండించిన పంటలను ఈ–క్రాప్ నమోదు చేయడంపై వ్యవసాయశాఖ దృష్టి సారించింది. వ్యవసాయ, ఉద్యాన పంటలైన పండ్లు, కూరగాయల తోటలు ఇలా ప్రతి ఒక్క పంటనూ నమోదు చేస్తున్నారు. రైతులు సాగు చేస్తున్న పొలంలోకి నేరుగా వ్యవసాయ సిబ్బంది స్వయంగా వెళ్లి పంట ఫొటో తీసి యాప్లో అప్లోడ్ చేస్తున్నారు. ఇప్పటివరకు ప్రత్తిపాడు మండలంలో 5785 ఎకరాల్లో 94 శాతం పంట నమోదు ప్రక్రియ పూర్తయ్యింది. ఈ ఏడాది సవరణలకు అవకాశం కల్పించకపోవడంతో నమోదు సమయంలో సిబ్బంది అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. 'ఈ–క్రాప్' ప్రక్రియను త్వరితగతిన ఈనెల 15వ తేదీ లోగా పూర్తి చేసేలా వ్యవసాయ శాఖ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు. రైతుభరోసా కేంద్రం ఇన్‌చార్జిలు పంటలను నమోదు చేసిన తరువాత, వివరాలను వీఆర్‌ఓ ధ్రువీకరించాల్సి ఉంటుంది. అనంతరం మండల వ్యవసాయ అధికారి లాగిన్‌కు వెళతాయి.



ప్రత్తిపాడు మండలంలో పంటపొలాలకు వెళ్లి ఈక్రాప్ నమోదు చేస్తున్న రైతుభరోసా కేంద్రం సిబ్బంది

గ్రామాల వారీగా ఈక్రాప్ నమోదు వివరాలు..

గ్రామం	ఈక్రాప్ నమోదు (ఎకరాల్లో)
యనమదల	609.19
కొండేపాడు	157.38
ప్రత్తిపాడు	357.07
కొండజాగర్లమూడి	34.67
నడింపాలెం	75.07
గొట్టిపాడు	1246
గనికపూడి	550.27
మల్లాయపాలెం	1133
వంగిపురం	1622.58
మొత్తం	5785.22

ఈ క్రాప్ వలన ప్రయోజనాలు..

- బ్యాంకు ద్వారా పంట రుణాలు సులువుగా పొందే వెసులుబాటు
- వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం పొందేందుకు వీలు
- ఎలాంటి ప్రీమియం చెల్లించకుండా ఉచిత పంటల బీమా పొందడం
- ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయినపుడు పరిహారం పొందేందుకు
- ధరల పతనం సమయంలో కనీస మద్దతు ధరతో వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించుకునేందుకు అవకాశం
- ఆర్‌బీకేల ద్వారా ఎరువులు, విత్తనాలు పొందేందుకు అవకాశం
- పలు వ్యవసాయ సంబంధ పథకాల ద్వారా లబ్ధిపొందేందుకు

అందరూ ఈ క్రాప్ చేయించుకోవాలి



ఇప్పటి వరకు మండలంలో 5,785 ఎకరాల్లో సాగు చేసిన పంటల నమోదు చేశాం. వంద శాతం ఈక్రాప్ నమోదయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. రైతులు కూడా వ్యవసాయశాఖ సిబ్బందికి సహకరించాలి. ఇప్పటివరకు నమోదు చేయించుకోని రైతులు వెంటనే తమ గ్రామాల్లోని ఆర్‌బీకే సిబ్బందిని సంప్రదించాలి.

– అరుణకుమారి, ఏఓ, ప్రత్తిపాడు

సంక్షేమ రథసారథి వైఎస్ జగన్

- పార్టీ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్
- అన్నవర్రులో గుండె గుండెకు జగనన్న– గడప గడపకు కిరణన్న



ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్

పెదనందిపాడు: రాష్ట్రంలో ప్రతి గడపకు సంక్షేమాన్ని అందించిన ఘటన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. మండల పరిధిలోని అన్నవర్రులో గుండె గుండెకు జగనన్న- గడప గడపకు కిరణన్న కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. తొలుత వరగాని గ్రామంలో రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించారు. వరగాని నుంచి అన్నవర్రు వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమంపై అవగాహన కల్పించారు. విద్య, వైద్యానికి ఇచ్చిన ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా బలసాని మాట్లాడుతూ నవరత్నాలు అమలుతో పేదల కుటుంబాల్లో ఆనందం నిండిందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలో నూరు శాతం అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని పేర్కొన్నారు. మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌ను చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కల్లూరి అన్నపూర్ణ, ఎంపీటీసీ సభ్యులు కల్లూరి నాగేశ్వరరావు(నాగు), చెల్లి లక్ష్మి, సర్పంచులు కొమ్మినేని దుర్గాప్రసాద్, కమ్మ నాగమల్లేశ్వరరావు, మండల మాజీ కన్వీనర్ మదమంచి వాసు, పెదనందిపాడు సొసైటీ అధ్యక్షుడు పాటిబండ్ల రాంబాబు, చింతా శ్రీనివాసరావు, నాగిశెట్టి సుబ్బారావు, నూరుబాషా బాజీ, కె.గోపిరాజ్ పాల్గొన్నారు.

ఘనంగా క్రెడాయ్ నూతన భవన ప్రారంభం



క్రెడాయ్ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న క్రెడాయ్ ప్రతినిధులు

పాత గుంటూరు: గుంటూరు మహాత్మాగాంధీ ఇన్నర్ రింగ్‌రోడ్డులోని శిల్పారామం వెనుక బాలాజీనగర్‌లో క్రెడాయ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ ఆళ్ల శివారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో క్రెడాయ్ గుంటూరు చాప్టర్ నూతన భవనం ప్రారంభోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. క్రెడాయ్ కార్యాలయానికి విరాళంగా స్థలం, భవనాన్ని నిర్మాణం చేయడంతో ఆళ్ళ శివారెడ్డి భవన్‌గా క్రెడాయ్ గుంటూరు చాప్టర్ నామకరణం చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆళ్ల శివారెడ్డి మాట్లాడుతూ దినదినాభివృద్ధి చెందుతున్న క్రెడాయ్ గుంటూరు చాప్టర్‌కు స్థలాన్ని ఇచ్చి దానిలో భవనాన్ని నిర్మించి ఇవ్వడం మా కుటుంబ సభ్యులందరికి ఎంతో సంతోషంగా ఉందన్నారు. క్రెడాయ్ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. క్రెడాయ్ నేషనల్ మాజీ ప్రెసిడెంట్, సీఐఐ, తెలంగాణ చైర్మన్ సి.శేఖర్ రెడ్డి మాట్లాడుతూ క్రెడాయ్ గుంటూరు చాప్టర్ వారు అధునాతన పద్ధతిలో సొంత భవనాన్ని నిర్మించుకోవడానికి తోడ్పాటునందించిన ఆళ్ల శివారెడ్డి దంపతులను అభినందించారు. క్రెడాయ్ జాతీయ సెక్రెటరీ జి.రామిరెడ్డి మాట్లాడుతూ క్రెడాయ్‌ను ప్రగతి పథంలో నడిపిస్తున్న శివారెడ్డిని అభినందించారు. క్రెడాయ్ జాతీయ జాయింట్ సెక్రెటరీ బి.రాజా శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ ప్రెసిడెంట్ వైవీ రమణ రావు, జనరల్ సెక్రెటరీ బి.శ్రీనివాసరావు, గుంటూరు చాప్టర్ చైర్మన్ ఆరుమళ్ల సతీష్‌రెడ్డి, ప్రెసిడెంట్ మామిడి రాము, సెక్రటరీ తియ్యగూర వినోద్ రెడ్డి, ట్రెజరర్ మద్ది నాగ వెంకట కార్తీక్, మెట్టు సాంబశివారెడ్డి. సురేష్, జాయింట్ సెక్రటరీ ఆళ్ళ నాగార్జున రెడ్డి, ఇ.సి. మెంబర్స్ తదితరులు ఆళ్ళ శివారెడ్డి దంపతులను సత్కరించారు.

బహుమతులు ప్రదానం

నగరంపాలెం: స్థానిక జేకేసీ కళాశాల రోడ్‌లోని వి.వి.వి.హెల్త్ హబ్‌లో గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సౌత్ ఇండియా– గుంటూరు జోనల్ టెన్నిస్ పోటీలు నిర్వహించారు. ప్రకాశం జిల్లాకు చెందిన భవానీదేవి(విన్నర్స్), క్రుషిద్ రన్నర్ టైటిల్‌ను సాధించారు. అనంతరం విజేతలకు వీవీవీ హెల్త్ హబ్ అధినేత టి.అరుణ్ కుమార్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాది సీహెచ్.రవీంద్రబాబు, ఎస్‌డి.రవికుమార్, జీవీఎస్‌ప్రసాద్, గంగాధర్, డీఈ కేవీఎల్ మూర్తి, సీనియర్ టెన్నిస్ క్రీడాకారులు, యోగా శిక్షకులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

గుంటూరు ఈస్ట్: వ్యక్తిపై దాడి ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. శ్రీనివాసరావు పేటలో ఆదివారం తెల్లవారుజామున సురేష్‌కుమార్ నడిచి వెళ్తుండగా ఇద్దరు అడ్డుకున్నారు. సురేష్‌కుమార్‌ని సెల్‌ఫోన్ ఇవ్వమని బెదిరించారు. సురేష్‌కుమార్ అందుకు నిరాకరించాడు. ఇద్దరు దాడి చేసి గాయపరిచారు. సురేష్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్‌లు అప్పగించిన జీఆర్పీ పోలీసులు



సెల్‌ఫోన్‌లను అప్పగిస్తున్న జీఆర్పీ పోలీసులు

లక్ష్మీపురం: రైళ్లలో ప్రయాణించే సమయంలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను సంబంధిత ప్రయాణికులను గుర్తించి అందించినట్లు జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక గుంటూరు రైల్వే స్టేషన్‌లో ఆదివారం సాయంత్రం సెల్‌ఫోన్‌లు పోగొట్టుకుని ఫిర్యాదు చేసిన పది మందికి ఫోన్లు అప్పగించారు. ఆయన మాట్లాడుతూ రైలులో ప్రయాణించే సయమంలో ప్రయాణికులు నిద్ర మత్తులో ఉండటం, స్టేషన్ వచ్చిన సమయంలో హడావుడిగా దిగడం వంటి పలు సందర్భాలలో సెల్‌ఫోన్‌లు, బ్యాగ్‌లను మరచి పోతుంటారని తెలిపారు. అటువంటి సమయంలో సంబంధిత రైల్వే స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం వలప ప్రయాణికులకు సెల్‌ఫోన్‌లను తమ విజయవాడ ఐటీ కోర్ సహకారంతో సెల్‌ఫోన్‌లను సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లు అందజేసే విధంగా రైల్వే ఎస్పీ ప్రత్యేక ప్రయాణికులను రూపొందించారు. రైలులో ప్రయాణికులకు అన్ని విధాల సదుపాయాలు కల్పించడంతో పాటు వారి భద్రత కూడా తాము బాధ్యతగా వ్యవహరించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అనంతరం పది మంది ప్రయాణికులకు సెల్‌ఫోన్‌లను అందజేయడంతో ప్రయాణికులు జీఆర్పీ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు డివిజన్ జీఆర్పీ ఎస్ఐలు జి.వెంకటాద్రి, పి.రమేష్ పాల్గొన్నారు.

రోడ్డుపై టీడీపీ నాయకుల బైఠాయింపు

పొన్నూరు: మండలంలోని పచ్చల తాడిపర్రులో టీడీపీ నాయకులు ఆదివారం బైఠాయించారు. పార్టీ జెండా తగలబెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గ్రామంలోని ప్రధాన రోడ్డుపై నిరసన తెలిపారు. దీంతో సుమారు గంటన్నర పాటు వాహనాలను నిలిపివేయడంతో వందలాది వాహనాల నిలిచిపోయాయి. పొన్నూరు, చీరాల, బాపట్ల, రేపల్లె వెళ్లే ప్రధాన రహదారిలో రాస్తారోకో చేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పార్టీ జెండా విషయంలో రోడ్డుపై రాకపోకలను నిలిపి వేయడమేంటని పలువురు వాహన చోదకులు మండిపడ్డారు. సమాచారం తెలుసుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని టీడీపీ నాయకులతో మాట్లాడి రాస్తారోకో విరమింపజేశారు.

జూదరులపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: పేకాటాడుతున్న ఎనిమిది మందిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. కుందుల రోడ్డులో పేకాటాడుతున్నరన్న సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వీరి నుంచి 52,800 రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పశు ఉత్పాదకతకు ప్రాముఖ్యం ఇవ్వాలి

ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ సీఈఓ డాక్టర్ శ్రీనివాసరావు



పశువులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గుంటూరు రూరల్: పశువుల ఉత్పాదకతకు రైతులు ప్రాముఖ్యత నివ్వాలని ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ సీఈఓ డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతు నేస్తం ఫౌండేషన్‌లో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ మన దేశం వ్యవసాయక దేశమని మొదటి నుంచి రైతులు పంటల సాగుతో పాటు పాడి పశువులను కూడా పోషిస్తూ పశు వ్యర్థాలను పంటల సాగుకు, పంటల వ్యర్థాలను పశువులకు అందిస్తూ జీవితాలను కొనసాగించారన్నారు. కాలం గడిచేకొద్దీ వివిధ రకాల కారణాల వలన వ్యవసాయం పశుపోషణ విడిపోవడం జరిగిందన్నారు. ఒకప్పుడు ఇంటి అవసరాలకు మొదలైన పశుపోషణ అనేక రకాలుగా మార్పు చెందుతూ ప్రస్తుతం పశుపోషణ వాణిజ్య పరంగా మారిందన్నారు. అధిక పాల దిగుబడుల కోసం మంచి పాడి పశువులను అభివృద్ధి చేయడం వలన వాణిజ్య సరళిలో పశు పోషణ చేపట్టే రైతులు ఎక్కువ మొత్తంలో పాడి పశువులను అధిక ధరలు పెట్టి కొనుగోలు చేస్తూ అధిక పాల దిగుబడి పొందుతూ స్వయం ఉపాధి మార్గంగా ఎంచుకుంటున్నారన్నారు. పాడి రైతులు ఆర్థికంగా లాభాలు ఆశించాలంటే పాడి పశువుల ఉత్పాదకత తప్పనిసరిగా పెరగాలని చెప్పారు. రైతు నేస్తం ఫౌండేషన్ రైతుల అభివృద్ధికి చేస్తున్న కృషిని అభినందించారు. వివిధ ప్రాంతాలకు చెందిన పాడి రైతులు తమ పాడి పశువులను వైద్య శిబిరానికి తీసుకొచ్చారు. ఆయా పశువులకు సంబంధించిన అనారోగ్యాలకు సంబంధించి నిపుణులైన పశు వైద్యులు పశువులను పరీక్ష చేసి అవసరమైన మందులు సలహాలను అందించారు. పాడి పశువులకు అవసరమైన ఆరోగ్యకరమైన పశుగ్రాసాల వివరాలు సమయానుకూలంగా పాడి పశువుల వయస్సు వాతావరణ మార్పులకు అనుగుణంగా పాడి పశువుల ఆరోగ్య రక్షణకు అవసరమైన టీకాల వివరాలను తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఏడీ డాక్టర్ ఎం.శివరాశర్మా, జాయింట్ డైరెక్టర్ జేపీ వెంకటేశ్వర్లు, రిటైర్డ్ జేడీ ఏ వెంకటేశ్వర్లు, లాం శాస్త్రవేత్త డాక్టర్ ముత్తారావు, రిటైర్డ్ జేడీ డాక్టర్ విజయకుమార్‌శర్మ, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ రాంబాబు, డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ మాదవరావు, డాక్టర్ సుబ్రహ్మణ్యాఆచారి, డాక్టర్ శివకుమార్, డాక్టర్ శివసాగర్‌రెడ్డి, డాక్టర్ సత్యనారాయణ, రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అర్హులైన స్థానికులకు ఉద్యోగావకాశాలు

టెక్ మహీంద్ర హెచ్‌ఆర్ ప్రతినిధులు శ్రీనివాసరెడ్డి, సృజన



కళాశాలలో పర్యటిస్తున్న టెక్ మహీంద్ర హెచ్ఆర్ ప్రతినిధులు శ్రీనివాసరెడ్డి, సృజన

ప్రత్తిపాడు: స్థానికంగా అర్హులైన వారికే ఉద్యోగావకాశాలు లభిస్తాయని టెక్ మహీంద్ర హెచ్‌ఆర్ ప్రతినిధులు శ్రీనివాసరెడ్డి, సృజన తెలిపారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ టెక్ మహీంద్ర క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఇంటర్వ్యూలకు జిల్లాలోని పలు ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులతో పాటు కృష్ణా, ప్రకాశం జిల్లాలకు చెందిన 1600 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరికి కంపెనీ హెచ్‌ఆర్ ప్రతినిధులు శ్రీనివాసరెడ్డి, సృజనలు రాత పరీక్ష, సాంకేతిక పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కంపెనీ నూతనంగా విశాఖపట్నం, విజయవాడల్లో నూతన శాఖలను ఏర్పాటు చేసిందని చెప్పారు. స్థానికంగా అర్హులైన అభ్యర్థులు ఉద్యోగావకాశాలు కల్పిస్తుందని తెలిపారు. ప్రస్తుతమున్న పోటీ ప్రపంచంలో విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగుపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు, సెక్రటరీ కోయి శేఖర్, డైరెక్టర్ డాక్టర్ కె. హరిబాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, ఉపాధికల్పనాధికారి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

తెలుగు జాతికి పట్టం – తెలుగోడికి పట్టాభిషేకం

పీవీకి భారతరత్న ప్రకటనపై సర్వత్రా హర్షం



పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆచారి తదితరులు

పట్నంబజారు: రాజకీయ అపర చాణక్యుడు..రాజనీతి కోవిదుడు..సాత్వికుడు.. బహుభాషా పండితుడు.. అన్నిటినీ మించి పదహారణాల తెలుగువాడు మన పాములపర్తి వెంకటనరసింహారావు (పీవీ) అని ఆంధ్రకేసరి అభిమాన సంఘం నేత, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి) కీర్తించారు. మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావుకు భారతరత్న ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ.. ఆదివారం ఆంధ్రకేసరి అభిమాన సంఘం ఆధ్వర్యంలో ప్రకాశంచౌక్ సెంటర్‌లో పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్పొరేటర్ ఆచారి మాట్లాడుతూ ఒక మనిషిలో ఎన్ని గుణాలు, సుగుణాలు.. ఒక రాజకీయ వేత్తలో ఎన్నెన్ని కోణాలు ఉండాలో అన్నన్నీ సమపాళ్లలో ఉన్న విలక్షణమైన వ్యక్తిత్వం, విజ్ఞానంతో కూడిన తేజస్సు, విశిష్టమైన యశస్సు పీవీ సొంతమని కొనియాడారు. ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి హోదాల్లో భారతదేశం ప్రయోజనాలు కాపాడడంలో పీవీ క్రియాశీలకంగా వ్యవహరించారన్నారు. పీవీ తీసుకున్న ఆర్థిక సంస్కరణ నిర్ణయాలు భారతావనికి దిక్సూచిగా మారాయన్నారు. ప్రతి తెలుగువాడు గర్వపడేలా ఆయన ప్రస్థానం సాగిందనీ.. అందుకే తెలుగు తల్లి ఒడిలో ఆయనకు సుస్థిర స్థానం లభించిందనీ, అలాంటి మహోన్నతుడైన తెలుగు తేజానికి దేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్న అవార్డు వరించడం ఒక్క తెలుగు వారికే కాక యావత్తు భరత జాతికే గర్వకారణమన్నారు. కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, బ్రాహ్మణ సేవా సమితి కార్యదర్శి బాలకృష్ణ, పొత్తూరి శ్యామ్, గీతామందిరం చైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్, మహేంద్ర గులేచా, పరశురామ బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధి కప్పగంతుల ఆదిలక్ష్మి, అన్నంరాజు సాయిరాం, అయితి సతీష్, ఆదిత్య రామకృష్ణ, డేవిడ్, నాగార్జున, విజయారెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు జీవితంలో అంతర్భాగం కావాలి

భాష్యం గుంటూరు అర్బన్ జోన్ స్పోర్ట్స్ మీట్‌లో డాక్టర్ రాకేష్‌బాబు



మాట్లాడుతున్న డాక్టర్ దేవాభక్తుని రాకేష్‌బాబు

గుంటూరు ఎడ్యుకేషన్: చిన్ననాటి నుంచే క్రీడలు మన జీవితంలో అంతర్భాగం కావడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చునని ప్రముఖ వైద్యులు దేవాభక్తుని రాకేష్‌బాబు అన్నారు. గోరంట్లలోని భాష్యం రామసేతు క్యాంపస్ మైదానంలో భాష్యం గుంటూరు అర్బన్ జోన్ స్పోర్ట్స్ మీట్ ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ రాకేష్‌బాబు మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కోరారు. క్రమం తప్పకుండా స్పోర్ట్స్ మీట్స్ నిర్వహిస్తూ, విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని నింపుతున్న భాష్యం విద్యాసంస్థల కృషి అభినందించారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలపై దృష్టి సారించి, వారిని సామాజిక మాధ్యమాలకు వీలైనంత దూరంగా ఉంచాలని, నిరంతరం వారు చేస్తున్నారనే విషయాన్ని పర్యవేక్షించాలని సూచించారు. మనం ఆరోగ్యంగా ఉండాలంటే ఇంటి భోజనం కంటే మించినది మరొకటి లేదని, ఫాస్ట్‌ఫుడ్స్‌కు దూరంగా ఉండాలని విద్యార్థులకు, తల్లిదండ్రులకు సూచించారు. తొలుత డాక్టర్ రాకేష్ బాబు స్పోర్ట్స్‌మీట్ జెండాను అవిష్కరించిన అనంతరం ఓపెన్ పరేడ్‌లో విద్యార్థుల గౌరవ వందనాన్ని స్వీకరించి, శాంతికి చిహ్నమైన పావురాలను ఎగురవేశారు. ఈసందర్భంగా స్పోర్ట్స్‌మీట్‌లో నిర్వహించిన వివిధ రకాల క్రీడలు వీక్షకులను అలరించాయి. క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు భాష్యం చైర్మన్ రామకృష్ణ చేతుల బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో భాష్యం గుంటూరు అర్బన్ – 1 జెడ్ ఈవో శివ, అర్బన్ – 2 జెడ్ ఈఓ స్వప్న, భాష్యం ఐఐటీ ప్రోగ్రామర్ ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.